ప్రజల చేతిలో

www.ayudamdaily.com

# ఆయుధం

The Common People's Voice

మంగళవారం | జూన్ 23, 2026 | సంపుటి : 7 | సంచిక : 22 | పేజీలు : 2

## లోక్ అదాలత్ ద్వారా 10,922 కేసులు పరిష్కారం




◆ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్

**వరంగల్, ఆయుధం:** వరంగల్ పోలీస్ కమిషనరేట్ వ్యాప్తంగా జాతీయ లోక్ అదాలత్ కు విశేష స్పందన లభించిందని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ అన్నారు. వీటి ద్వారా 10922 కేసులు పరిష్కార మయ్యాయని, సైబర్ క్రైమ్ కేసుల్లో 1 కోటి 17 లక్షలకు పైగా రిఫండ్ మొత్తాన్ని బాధితులకు అందజేయాల్సిందిగా కోర్టు ఉత్తర్వులు జారీ చేసిందని వరంగల్ పోలీస్ కమిషనర్ తెలిపారు.




## బీఆర్ఎస్ దోపిడీని మరిచిపోయారని

# కేటీఆర్ భ్రమ

- ఎన్నికలు ఎప్పుడు జరిగినా వంద సీట్లు గెలుస్తాం
- బీజేపీ ఓట్ల చోరీ.. సీట్ల చోరీ

**హనుమకొండ, ఆయుధం:** ఓట్ల చోరీయే కాకుండా సీట్ల చోరీకి కూడా భాజపా పాల్పడుతోందని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ విమర్శించారు. తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్చార్జ్ మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషనన్ను కావాలనే తిరస్కరించారని ఆరోపించారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో ఎస్ఐర్పై నిర్వహించిన బూత్ లెవల్ ఏజెంట్ల శిక్షణ కార్యక్రమంలో మీనాక్షి నటరాజన్ తో కలిసి మహేశ్ కుమార్ గౌడ్ పాల్గొన్నారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పాలనలో పదేళ్లపాటు దోపిడీ చేసి ఇప్పుడు కేటీఆర్ అసత్యాలు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ దోపిడీని ప్రజలు మరిచిపోయారనే భ్రమలో కేటీఆర్ ఉన్నారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి, సంక్షేమం జోడెద్దుల్లా ఉన్నాయన్నారు. రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు ఎప్పుడు జరిగినా కాంగ్రెస్ పార్టీ వంద సీట్లు గెలవడం ఖాయమని మహేశ్ కుమార్ గౌడ్ ధీమా వ్యక్తం చేశారు.



## వెంకన్న కుటుంబానికి అండగా ఉంటాం

- శవరాజకీయాలు చేయొద్దు
- ఎంవీఐ వెంకన్న పార్థివ దేహానికి మంత్రి పొన్నం నివాళి

## పదేళ్ల బీఆర్ఎస్ పాలన సంక్షేమం
## రెండున్నరేండ్ల కాంగ్రెస్ పాలన సంక్షోభం

- పంటల కొనుగోళ్లపై రైతులకు మరణ శాసనం రాశారు
- రాబోయే ఐదేళ్లు కార్యకర్తలే అభివృద్ధే లక్ష్యం
- డిజిటల్ మెంబర్ షిప్, శిక్షణ తరగతుల్లో మాజీ మంత్రి కేటీఆర్

**హనుమకొండ, ఆయుధం:** పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో సంక్షేమం జరుగగా రెండున్నరేండ్ల కాంగ్రెస్ పాలనలో సంక్షోభం దిశగా మారిందని.. వచ్చే ఐదేళ్లు కార్యకర్తల అభివృద్ధి లక్ష్యంగా పనిచేసే బాధ్యత నేను తీసుకుంటానని బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు అన్నారు. వర్ధన్నపేట నియోజకవర్గస్థాయి ఎస్ఐఆర్ ప్రక్రియపై బిఆర్ఎస్ పార్టీ నాయకులకు అవగాహన కార్యక్రమం సత్యసాయి కన్వెన్షన్ లో వర్ధన్నపేట నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ అధ్యక్షతన నిర్వహించిన బిఆర్ఎస్ పార్టీ ఎస్ఐఆర్ ప్రక్రియ, డిజిటల్ మెంబర్‌షిప్ (సభ్యత్వ నమోదు) సోషల్ మీడియాపై నిర్వహించిన శిక్షణ తరగతులలో బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు పాల్గొన్నారు.ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ ఇందిరమ్మ రాజ్యం వచ్చింది.. ఇంటింటా సంక్షోభం తెచ్చిందని పంటల కొనుగోళ్లపై రేవంత్ రెడ్డి రైతులకు మరణ శాసనం రాసిందనిఒకప్పుడు కేంద్రం చెప్తే వినడానికి మోడీ బ్రోకరా అన్న రేవంత్ రెడ్డి. ఇప్పుడు అదే పని చేస్తున్నాడని మోడీ చెప్పినంతనే పంట కొంటాం అంటున్నడు రేవంత్ రెడ్డి వచ్చే సీజన్ నుంచి రైతన్నల పంటలు కొనే నాథుడే ఉండరని తెలిపారు. రెండున్నర సంవత్సరాలలో తెలంగాణ రాష్ట్రానికి ఒక్క మంచి పని కాంగ్రెస్ చేయలేదని చెప్పారు. కార్యకర్తలను పార్టీ నేతలను వేధించే రేవంత్ రెడ్డినికాంగ్రెస్ నేతలను, అధికారులను వదిలిపెట్టేదే లేదు అని హెచ్చరించారు. అరూరి రమేష్ మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి డిజిటల్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రతి నాయకుడు, కార్యకర్త బాధ్యతగా తీసుకొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఎస్ఐర్ ప్రక్రియపై ప్రజలకు అవగాహన కల్పించి, ప్రతి అర్హుడికి న్యాయం జరిగేలా కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు, పార్టీ శ్రేణులు గ్రామస్థాయిలో ప్రజలతో మమేకమై పార్టీ కార్యక్రమాలను విస్తృతంగా తీసుకెళ్లాలని కోరారు.
ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, ఎమ్మెల్యే పాడీ కౌశిక్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు దాస్యం వినయ్ భాస్కర్, టి. రాజయ్య, పెద్ది సుదర్శన్ రెడ్డి, గండ్ర వెంకటరమణ రెడ్డి, మాజీ కార్పొరేషన్ చైర్మన్లు సతీష్ రెడ్డి, వాసుదేవ రెడ్డి, మాజీ జడ్పీ చైర్మన్ సుధీర్ బాబు, బిఆర్ఎస్ నాయకులు ఏనుగుల రాకేష్ రెడ్డి, లలిత యాదవ్ మాజీ వర్ధన్నపేట నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ నాయకులు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.







## పేదలకు సొంతింటి కల దూరం చేయొద్దు

- మహేష్ కుమార్ గౌడ్ కు వామపక్షాల వినతి

**హనుమకొండ, ఆయుధం:** పేదవాడికి సొంతింటి కలను దూరం చేసే విధానానికి స్వస్థి చెప్పాలని హనుమకొండ, వరంగల్ జిల్లా వామపక్ష పార్టీల నేతలు తెలంగాణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ కు విన్నవించారు. సోమవారం హనుమకొండ డిసిసి భవన్ లో హనుమకొండ, వరంగల్ జిల్లా వామపక్ష పార్టీల నేతలు తెలంగాణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ కు సీపీఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, సీపీఎం గాదె ప్రభాకర్ రెడ్డి, సీపీఐ వరంగల్ జిల్లా కార్యదర్శి షేక్ బాష్ మియా, ఎంసిపిఐయు జిల్లా నాయకులు కర్ర రాజి రెడ్డి, సీపీఐ వరంగల్ జిల్లా సహాయ కార్యదర్శి దండు లక్ష్మణ్, సీపీఐ హనుమకొండ మండల కార్యదర్శి ఎన్ ఎ స్టాలిన్ లు కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వామపక్ష పార్టీల నేతలు మాట్లాడుతూ హనుమకొండ మండలంలోని గుండ్ల సింగారం, గోపాలపురంలో నిరుపేదలు వేసుకున్న గుడిసెలకు తొలగించడం ప్రజా ప్రభుత్వం పేదల ఇండ్లు కూల్చడం దారుణమని వారు అవేదన వ్యక్తం చేశారు. ఈ గుడిసెల కూల్చివేతను ఆపేలా తమ ప్రభుత్వంలో ఉన్నటువంటి ప్రజాప్రతినిధులకు వారి ద్వారా అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని వారిని కోరారు. వినతి పత్రం ఇచ్చిన కార్యక్రమంలో సీపీఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, సీపీఎం గాదె ప్రభాకర్ రెడ్డి, సీపీఐ వరంగల్ జిల్లా కార్యదర్శి షేక్ బాష్ మియా, ఎంసిపిఐయు జిల్లా నాయకులు కర్ర రాజి రెడ్డి, సీపీఐ వరంగల్ జిల్లా సహాయ కార్యదర్శి దండు లక్ష్మణ్, సీపీఐ హనుమకొండ మండల కార్యదర్శి ఎన్ ఎ స్టాలిన్ తదితరులు పాల్గొన్నారు.




## పుడ్ సేఫ్టీ ప్రమాణాలు పక్కాగా అమలు చేయాలి

- ప్రభుత్వ హాస్టళ్లు, గురుకులాలు, అంగన్వాడీ కేంద్రాల్లో పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలి
- కలెక్టర్ బోర్డడే హేమంత్ సహదేవరావు

## ప్రజావాణి అర్జీల పరిష్కారంలో జాప్యానికి తావులేదు

- జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి

**హనుమకొండ, ఆయుధం:** ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి స్వీకరించిన దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా సంబంధిత శాఖల అధికారులు వెంటనే పరిశీలించి పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి ఆదేశించారు. ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ప్రతి అర్జీపై బాధ్యతాయుతంగా స్పందించాలని సూచించారు. సోమవారం కలెక్టరేట్ లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించిన అనంతరం, వివిధ శాఖలకు సంబంధించిన పెండింగ్ అర్జీల స్థితిగతులపై జిల్లా కలెక్టర్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రజావాణి పోర్టల్‌లో నమోదైన అర్జీలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా పలువురు తహసీల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడిన కలెక్టర్, రెవెన్యూ మరియు ఇతర శాఖలకు సంబంధించిన వినతుల పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టి, చేపట్టిన చర్యలపై నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యానికి తావులేదని స్పష్టం చేశారు.
అనంతరం కలెక్టరేట్ లోని ప్రజావాణి ఆన్‌లైన్ నమోదు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ సందర్శించి, దరఖాస్తుల నమోదు ప్రక్రియను పరిశీలించారు. ప్రజలు అధిక సంఖ్యలో నమోదు కేంద్రం వద్ద వేచి ఉండటాన్ని గమనించిన కలెక్టర్, ఆపరేటర్లు అర్జీల వివరాలను వేగంగా స్కాన్ చేసి ప్రజావాణి పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు.





## జర్నలిస్టుల ఆర్థిక భద్రతకే పద్మశాలి సహకార సంఘం

◆ సంఘం అధ్యక్షులు వేముల నాగరాజు

**హన్మకొండ, ఆయుధం:** జర్నలిజం అనేది కేవలం వృత్తి మాత్రమే కాదని, సమాజం పట్ల అది ఒక పెద్ద బాధ్యత అని గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్, సంఘం అధ్యక్షులు వేముల నాగరాజు స్పష్టం చేశారు. పగలు, రాత్రి తేడా లేకుండా సమాజ శ్రేయస్సు కోసం నిరంతరం శ్రమించే జర్నలిస్టులకు వ్యక్తిగత జీవితంలో ఆర్థిక భద్రత కల్పించడం అత్యంత ఆవశ్యకమన్నారు. అత్యవసర పరిస్థితుల్లో జర్నలిస్టులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోకుండా అండగా నిలిచేందుకే 'పద్మశాలి వర్కింగ్ జర్నలిస్టుల పొదుపు, పరపతి పరస్పర సహాయక సహకార సంఘం లిమిటెడ్'ను స్థాపించినట్లు ఆయన వెల్లడించారు. హన్మకొండ,హంటర్ రోడ్ లోని ది వీవర్స్ వెల్ఫేర్ ట్రస్ట్ బోర్డ్ భవనంలో పద్మశాలి వర్కింగ్ జర్నలిస్టుల పొదుపు,పరపతి పరస్పర సహాయక సహకార సంఘం లిమిటెడ్ సర్వసభ్య సమావేశం సంఘం అధ్యక్షులు వేముల నాగరాజు అధ్యక్షతన ఆదివారం జరిగింది. (వివరాలు 2 లో.. )



## డ్రగ్స్ రహిత సమాజమే మనందరి లక్ష్యం

- పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్

**హనుమకొండ, ఆయుధం:** డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణమే మనందరి ప్రధాన లక్ష్యమని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ ప్రజలకు పిలుపునిచ్చారు. ప్రపంచ మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా నిరోధక దినోత్సవాన్ని పురస్కరించుకొని మత్తు పదార్థాల నియంత్రణ విభాగమైన తెలంగాణ ఈగల్ ఫోర్స్ విభాగం మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా ప్రచారం కల్పిస్తూ నూతనంగా రూపొందించిన వాల్ పోస్టర్లను వరంగల్ పోలీస్ కమషనర్ సోమవారం అవిష్కరించారు. మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా వారం రోజులు పాటు వరంగల్ పోలీస్ కమిషనరేట్ నిర్వహించే అవగాహన కార్యక్రమాలపై వరంగల్ పోలీస్ కమిషనర్ సిసిఆర్‌బి ఏసిపి డేవిడ్ రాజును అడిగి తెలుసుకున్నారు. అనంతరం పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ముమ్మరంగా ప్రచారం కొనసాగించాలని, ముఖ్యంగా పాఠశాలలు, కళాశాల విద్యార్థుల్లో అవగాహన కల్పించేందుకుగాను పెద్ద సంఖ్య అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి, డ్రగ్స్‌కు వ్యతిరేకంగా పనిచేసే సైనికుడిగా విద్యార్థులను తీర్చిదిద్దాలని, యువతను మత్తు బానిసలుగా మారకుండా యువతను కాపాడుకోవాల్సిన బాధ్యతని వరంగల్ పోలీస్ కమిషనర్ తెలియజేసారు. అనంతరం తెలంగాణ ఈగల్ ఫోర్స్ జారీ చేసిన "ఐయామ్ ఏ యాంటీ డ్రగ్స్ సోల్జర్" ఫోటో బూత్‌లో పోలీస్ కమిషనర్ ఫోటో దిగి యువతకు స్ఫూర్తినిచ్చారు. ఈ కార్యక్రమములో ఈస్ట్‌జోన్ డిసిపి అంకిత్‌కుమార్, ఏసిపిలు డేవిడ్‌రాజు, జాన్‌నర్సింహులు, వెంకటేష్, ఇన్స్‌స్పెక్టర్ సంజీవ్‌రావు, దామెదార్ రెడ్డి, మల్లయ్య, సురేష్ పాల్గొన్నారు.

## బొగ్గు లారీ ఢీకొని డీటీవో మృతి



(ఫైల్ ఫోటో..)

**భూపాలపల్లి, ఆయుధం:** విధి నిర్వహణలో నిమగ్నమైన ఓ ప్రభుత్వ అధికారి క్షణాల్లో మృత్యువాత పడిన ఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో తీవ్ర విషాదాన్ని నింపింది. జిల్లా రవాణా శాఖ అధికారి (డీటీవో) వెంకన్న సోమవారం చెల్పూరు శివారులోని ఆర్టీవో కార్యాలయం ఎదుట జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు. ప్రతి రోజులాగే వాహనాల తనిఖీల్లో నిమగ్నమైన వెంకన్న, రహదారి భద్రత కోసం విధులు నిర్వహిస్తుండగా అతివేగంగా దూసుకొచ్చిన బొగ్గు లారీ మృత్యురూపంలో మారింది. టీఎస్ 22టీ 2687 నంబర్ గల బొగ్గు టిప్పర్ (లారీ) ఆర్టీవో వాహనం సమీపంలో ఉన్న వెంకన్నను ఢీ కొట్టడంతో ఆయన తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే ఆస్పత్రికి తరలించినప్పటికీ మార్గమధ్యలోనే కన్నుమూశారు. కొద్ది రోజుల క్రితమే జయశంకర్ భూపాలపల్లి జిల్లాకు బదిలీ పై వచ్చిన వెంకన్న, తన విధుల పట్ల అంకితభావంతో పని చేస్తున్నారని సహచరులు గుర్తు చేసుకుంటున్నారు. జిల్లా ప్రజలకు మెరుగైన రవాణా సేవలు అందించాలనే లక్ష్యంతో పని చేస్తున్న సమయంలోనే ఆయన మృతి చెందడం అందరినీ కలచివేసింది. ప్రమాద వార్త తెలిసిన వెంటనే రవాణా శాఖ అధికారులు, సిబ్బంది, స్థానిక ప్రజలు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. కాసేపటి క్రితం వరకు తమతో కలిసి విధులు నిర్వహించిన అధికారి ఇక లేరన్న విషయం జీర్ణించుకోలేక సహచరులు కన్నీటి పర్యంతమయ్యారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన వెంకన్న మృతి జిల్లాలో తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. ఆర్టీవో కార్యాలయం పరిసరాలు శోకసంద్రంగా మారగా ప్రతి ఒక్కరి హృదయాన్ని కదిలించాయి. ప్రజా సేవకు అంకితమైన ఓ అధికారి జీవితం ఇంత విషాదకరంగా ముగియడం పట్ల జిల్లా వ్యాప్తంగా సంతాపం వ్యక్తమవుతోంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.




## నేడు దేశవ్యాప్త ధర్నా

- గ్రామీణ తపాల ఉద్యోగులు భారీగా పాల్గొనాలి
- అఖిలభారత గ్రామీణ తపాల ఉద్యోగుల సంఘం జాతీయ అధ్యక్షుడు బొద్దున వెంకటేశ్వర్లు

## తెలంగాణలో పలు జిల్లాలకు భారీ వర్ష సూచన

**హైదరాబాద్, ఆయుధం:** తెలంగాణలోని పలు జిల్లాల్లో ఐదు రోజుల పాటు అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ తెలిపింది. ఇవాళ నిజామాబాద్, జగిత్యాల, సిరిసిల్ల, పెద్దపల్లి, భూపాలపల్లి, మహబూబాబాద్, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశముందని తెలిపింది. మంగళవారం జగిత్యాల, సిరిసిల్ల, కామారెడ్డి, మెదక్, నల్గొండ, సూర్యాపేట జిల్లాల్లో భారీ వర్షాలు పడే వీలుందని పేర్కొంది. నైరుతి రుతుపవనాలు, ద్రోణి ప్రభావంతో వర్షాలు పడే సూచనలు ఉన్నాయని తెలిపింది.

### ఏపీలో రాగల మూడు గంటల్లో..

మరో వైపు ఏపీలో రాగల మూడు గంటల్లో పలు జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశముందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్‌జైన్ తెలిపారు. ఏలూరు, ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేశామన్నారు. పలు జిల్లాల్లో ఈదురు గాలులతో వర్షం, పిడుగులు పడే అవకాశముందని.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

# వెంకన్న కుటుంబానికి అండగా ఉంటాం

- శవరాజకీయాలు చేయొద్దు
- ఎంవీఐ వెంకన్న పార్థివ దేహానికి మంత్రి పొన్నం నివాళి

**హనుమకొండ, ఆయుధం:** భూపాలపల్లి లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఎంవీఐ వెంకన్న పార్థివ దేహానికి హనుమకొండ లోని వారి నివాసంలో మంత్రి పొన్నం ప్రభాకర్, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, నాగరాజు , కుడా చైర్మన్ ఇనగల వెంకట్రామి రెడ్డి, హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్ లు నివాళులర్పించారు. ఎంవీఐ వెంకన్న కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. భూపాలపల్లి లో రవాణా శాఖ అధికారి వెంకన్న ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారని.. ఘటనపై విచారణ జరిపించాలని ప్రిన్సిపాల్ సెక్రటరీ, జాయింట్ ట్రాన్స్పోర్ట్ కమిషనర్ చంద్రశేఖర్ ను విచారణ అధికారిగా ప్రభుత్వం నియమించిందని తెలిపారు. ప్రభుత్వం వారి కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రవాణా శాఖ పక్షాన రవాణా నిబంధనలు అమలు చేస్తూ నిబంధనలు అతిక్రమించిన వారిపై ఎన్ఫోర్స్మెంట్ పెంచినట్లు తెలిపారు. శవ రాజకీయాలు చేసే సందర్భం కాదని.... ఇలాంటి వాటిపై ప్రభుత్వం సీరియస్ గా ఉందని అన్నారు. ఎలాంటి అక్రమ రవాణా జరిగిన ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ''గతంలో లారీ కింద పడిన శవాలు దొరకకుండా చేశారు.. నేరెళ్ళ ఘటనలో ఇసుక లారీల సంఘటనపై వారిని జీవితానికి పనికి రాకుండా చేశారు. మీరా కుమార్ వస్తె జైలుకు కూడా పోనివ్వలేదు.'' అని పేర్కొన్నారు.

# లోక్ అదాలత్ ద్వారా 10,922 కేసులు పరిష్కారం

- పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్




**వరంగల్, ఆయుధం:** వరంగల్ పోలీస్ కమిషనరేట్ వ్యాప్తంగా జాతీయ లోక్ అదాలత్ కు విశేష స్పందన లభించిందని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ అన్నారు. వీటి ద్వారా 10922 కేసులు పరిష్కార మయ్యాయని, సైబర్ క్రైమ్ కేసుల్లో 1 కోటి 17 లక్షలకు పైగా రిఫండ్ మొత్తాన్ని బాధితులకు అందజేయాల్సిందిగా కోర్టు ఉత్తర్వులు జారీ చేసిందని వరంగల్ పోలీస్ కమిషనర్ తెలిపారు. జాతీయ మెగా లోక్ అదాలత్ ద్వారా రాజీకి అవకాశం ఉండి పరిష్కరించిన మొత్తం కేసుల్లో కేసుల్లో ఎఫ్ఐఆర్ కేసులు 1880, డిజాస్టర్ మేనేజ్మెంట్ కేసులు 2864, ఈ పెట్టి కేసులు 201, డ్రంకెన్ అండ్ డ్రైవ్, మోటార్ వెహికల్ చట్టం కేసులు 5977, సైబర్ కేసులు 197 పరిష్కరించడం ద్వారా బాధితులకు సంబంధించి వివిధ బ్యాంక్ ఖాతాల్లో నిలుపుదల చేసిన 1,17,95,706/ రూపాయలు బాధితులకు అందజేయాల్సిందిగా కోర్టు ఉత్తర్వులు వెలుబడించిందని తెలిపారు. రాజీ మార్గం రాజా మార్గమని, లోక్ అదాలత్ ద్వారా ఇరు వర్గాలకు న్యాయం జరుగుతుందని అవగాహన కల్పించి కేసుల పరిష్కారానికి కృషి చేసిన పోలీస్ అధికారులను, సిబ్బందిని పోలీస్ కమిషనర్ అభినందించారు.

# ఫుడ్ సేఫ్టీ ప్రమాణాలను పక్కాగా అమలు చేయాలి

- ప్రభుత్వ హాస్టళ్లు, గురుకులాలు, అంగన్వాడీ కేంద్రాల్లో పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలి
- కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు



**ములుగు, ఆయుధం:** ఫుడ్ సేఫ్టీ ప్రమాణాలను కచ్చితంగా అమలు చేయాలని, ప్రభుత్వ హాస్టళ్లు, గురుకులాలు, అంగన్వాడీ కేంద్రాల్లో పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, వీధి ఆహార విక్రయ కేంద్రాలను క్రమం తప్పకుండా తనిఖీ చేయాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు అధ్యక్షతన ఫుడ్ సేఫ్టీపై జిల్లా స్థాయి అడ్వైజరీ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు మాట్లాడుతూ... ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లు, గురుకులాలు, మధ్యాహ్న భోజన పథకం అమలవుతున్న పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలలో ఆహార పదార్థాల తయారీ జరిగే ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆహార పదార్థాల తయారీలో పనిచేసే సిబ్బందికి ప్రతి మూడు నెలలకు ఒకసారి తప్పనిసరిగా వైద్య పరీక్షలు నిర్వహించాలని సూచించారు. హాస్టళ్లలో ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్ల నీటిని క్రమం తప్పకుండా పరీక్షించి, అవి భారత ఆహార భద్రత ప్రమాణాల సంస్థ నిర్దేశించిన ప్రమాణాలకు అనుగుణంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా వీధి ఆహార విక్రయ కేంద్రాలను ప్రతి వారం కనీసం 10 నుండి 15 వరకు తనిఖీ చేసి, ప్రజలకు సురక్షితమైన ఆహారం అందేలా నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని సంబంధిత శాఖ అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ సి.హెచ్.మహేందర్ జీ, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఎం సంపత్ రావు, ఫుడ్ సేఫ్టీ అధికారి, జిల్లా అధికారులు, సంబంధిత అధికారులు, తదితరులు, పాల్గొన్నారు.

# 'ప్రజావాణికి అర్జీలపై తక్షణ చర్యలు తీసుకోవాలి'

**ములుగు, ఆయుధం:** ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన ప్రతి అర్జీ పై తక్షణ చర్యలు తీసుకోవాలని, ప్రజల సమస్యలను పరిష్కరించడంలో అధికారులు నిర్లక్ష్యం వహించకూడదని, జాప్యానికి తావు లేకుండా చూడాలని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు, ఫిర్యాదుదారుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 78 దరఖాస్తులు రాగా,వాటిలో ఇందిరమ్మ ఇండ్లకు 35, పెన్షన్లకు 18, ఇతర శాఖలకు సంబంధించినవి 25 దరఖాస్తులు అందాయి. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు సమర్పించిన ప్రతి అర్జీని సంబంధిత శాఖ అధికారులు బాధ్యతాయుతంగా పరిశీలించి, నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా సమస్యల పరిష్కారానికి అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తుల పై ఎప్పటికప్పుడు సమీక్ష నిర్వహిస్తూ పరిష్కార ప్రక్రియను వేగవంతం చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు సీహెచ్ మహేందర్ జి, సంపత్ రావు, ఆర్ డి ఓ కృష్ణవేణి, డి ఆర్ ఓ రవికుమార్, అన్ని శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# అన్ని శాఖల సమన్వయంతో అభివృద్ధి

**వేలేరు, ఆయుధం:** వేలేరు మండల కేంద్రంలోని రైతు వేదిక లో సర్పంచులు, అధికారుల మండల స్థాయి సమన్వయ సమావేశం ఎంపీడీవో కిషన్ నాయక్ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో వేలేరు మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులు, వేలేరు సర్పంచ్ బిల్లా యాదగిరి, సర్పంచులు అశోక్, మనోజ్, అనిత, శ్రీనివాస్, మౌనిక, రమాదేవి, రాజు, సాంబయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజా ప్రతినిధులు, అధికారుల సమన్వయంతో గ్రామాలు, మండలం అభివృద్ధి చెందుతుందని అన్నారు. మండలానికి ప్రత్యేకమైన నిధులు మంజూరు చేయడం జరుగుతుందని, త్వరలో ఎమ్మెల్యే సహకారంతో ఎమ్మార్వో, ఎంపీడీవో ఆఫీసులు నిర్మించడం జరుగుతుందని, అన్ని శాఖల సమన్వయంతో గ్రామ పంచాయతీల అభివృద్ధి సాధించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో బుచ్చి రెడ్డి, ఏవో కవిత, ఎంఈవో చంద్ర మొగిలి, ఏఈ పీఆర్ రూపవతి, హౌసింగ్ ఏఈ, అభిలాష్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సతీష్, విద్యుత్ శాఖ ఏఈ కుమారస్వామి, ఏపీవో విజయ, ఏపీఎం అనిత, ఇరిగేషన్, మిషన్ భగీరథ శాఖ, వైద్యశాఖ, పశుసంవర్ధక శాఖ, స్త్రీ శిశు సంక్షేమ శాఖ, హార్టికల్చర్ శాఖ, మండలంలోని అన్ని గ్రామాల గ్రామపంచాయతీ ల కార్యదర్శులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల ఆర్థిక భద్రతకే పద్మశాలి సహకార సంఘం!

- సంఘం అధ్యక్షులు వేముల నాగరాజు



**హన్మకొండ, ఆయుధం:** జర్నలిజం అనేది కేవలం వృత్తి మాత్రమే కాదని, సమాజం పట్ల అది ఒక పెద్ద బాధ్యత అని గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్, సంఘం అధ్యక్షులు వేముల నాగరాజు స్పష్టం చేశారు. పగలు, రాత్రి తేడా లేకుండా సమాజ శ్రేయస్సు కోసం నిరంతరం శ్రమించే జర్నలిస్టులకు వ్యక్తిగత జీవితంలో ఆర్థిక భద్రత కల్పించడం అత్యంత ఆవశ్యకమన్నారు. అత్యవసర పరిస్థితుల్లో జర్నలిస్టులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోకుండా అండగా నిలిచేందుకే 'పద్మశాలి వర్కింగ్ జర్నలిస్టుల పొదుపు, పరపతి పరస్పర సహాయక సహకార సంఘం లిమిటెడ్'ను స్థాపించినట్లు ఆయన వెల్లడించారు. హన్మకొండ,హంటర్ రోడ్ లోని ది వీవర్స్ వెల్ఫేర్ ట్రస్ట్ బోర్డ్ భవనంలో పద్మశాలి వర్కింగ్ జర్నలిస్టుల పొదుపు,పరపతి పరస్పర సహాయక సహకార సంఘం లిమిటెడ్ సర్వసభ్య సమావేశం సంఘం అధ్యక్షులు వేముల నాగరాజు అధ్యక్షతన ఆదివారం జరిగింది. ఈ సమావేశంలో సంఘం కోశాధికారి వేముల సదానందం నేత ఆరు సంవత్సరాల సంఘం లావాదేవీల ఆడిట్ రిపోర్ట్‌ను ప్రవేశపెట్టారు. ప్రగతి నివేదికను సంఘం ప్రధాన కార్యదర్శి వల్లాల వెంకట రమణ సమర్పించారు.

ఈ సందర్భంగా సభాధ్యక్షులు వేముల నాగరాజు మాట్లాడుతూ సమాజంలో కీలక పాత్ర పోషించే జర్నలిస్టులు తమ వ్యక్తిగత జీవితాల్లో ఎదుర్కొంటున్న ఆర్థిక సమస్యలపై ఆందోళన వ్యక్తం చేశారు. విధి నిర్వహణలో నిమగ్నమై, అత్యవసర సమయాల్లో చేతిలో డబ్బులు లేక, ఎవరిని సహాయం అడగాలో తెలియక అనేకమంది జర్నలిస్టులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన గుర్తుచేశారు. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో ప్రతి జర్నలిస్టుకు ఒక ఆర్థిక భరోసా ఇవ్వాలనే సంకల్పంతోనే పద్మశాలి సీనియర్ జర్నలిస్టులు మేధోమథనం నుంచే ఈ పరస్పర సహాయక సహకార సంఘం పుట్టిందని వేముల తెలిపారు. ఈ సంఘం ద్వారా జర్నలిస్టులలో పొదుపు శాతాన్ని పెంచడంతో పాటు, వారికి అవసరమైనప్పుడు పరపతి (ఆర్థిక సహాయం) అందిస్తూ పరస్పరం సహకరించుకునే వాతావరణాన్ని కల్పిస్తామని ఆయన చెప్పారు. జర్నలిస్టుల సంక్షేమమే ధ్యేయంగా ఈ సంఘం పనిచేస్తుందని ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

సంఘం ప్రధాన కార్యదర్శి వల్లాల వెంకట రమణ మాట్లాడుతూ పరస్పర సహకారం, పొదుపు అనే ఆశయాలతో ఆరు సంవత్సరాల రెండు నెలల క్రితం ఆవిర్భవించిన మన సంఘం ఈ రోజు ఒక బలమైన ఆర్థిక శక్తిగా ఎదిగి, సభ్యులందరికీ ఆర్థిక భరోసాను అందించడం గర్వకారణమని వల్లాల అన్నారు. సభ్యులు వాటా ధనంగా మార్చి నాటికి 71 నెలలకు గాను రూ.35,500/ చెల్లించగా ఏడాదిన్నర కాలంలో సంఘానికి వచ్చిన ఆదాయంతో ప్రతి సభ్యుడి వాటా గణనీయంగా పెరిగిందని.. కోశాధికారి వేముల సదానందం నేత స్పష్టం చేశారు. ఆరు సంవత్సరాల ఆడిట్ రిపోర్టును కాపీలను సభ్యులకు వేముల సదానందం నేత అందజేశారు. అనంతరం జూలై నెల నుండి సభ్యుల వాటా ధనం రూ. 500/ నుండి రూ.1000/ లకు పెంచుతూ సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది. సభ్యులకు జమానత్ లేకుండా రూ.40,000/లు, జమానతు ఉంటే రూ.80,000/ రుణాలు ఇవ్వాలని, 2026 మార్చి నాటికి రెగ్యులర్ గా వాట ధనం/ కిస్తీలు చెల్లించని సభ్యులను తొలగిస్తే లాభాలు వర్తించవని మరో తీర్మానాన్ని ఆమోదించారు. వరుసగా మూడు నెలలు కిస్తీ లు చెల్లించని సభ్యులను సంఘం నుండి తొలగించాలని తీర్మానం చేశారు. సంఘం సభ్యులు దురదృష్టవశాత్తు చనిపోతే తక్షణమే ఆర్థిక సహాయంగా రూ.10,000/ అందజేయాలని సమావేశంలో తీర్మానించారు. ప్రస్తుతం ఉన్న కమిటీని తిరిగి కొనసాగాలని, కాకపోతే సమావేశాలకు సరిగ్గా హాజరు కాని డైరెక్టర్లను మార్చాలని సమావేశం నిర్ణయించింది. కోశాధికారి వేముల సదానందం నేత ప్రవేశ పెట్టిన ఆరు సంవత్సరాల ఆడిట్ రిపోర్టుపై సభ్యులు సంతృప్తి వ్యక్తం చేస్తూ తీర్మానించారు. ఆడిట్ రిపోర్ట్ పై పలువురు సభ్యులు లేవనెత్తిన సందేహాలకు ఆడిటర్ బింగి లక్ష్మీనారాయణ నివృత్తి చేశారు. ఈ సమావేశానికి కోశాధికారి వేముల సదానందం నేత వందన సమర్పణ చేశారు.





# గ్రీవెన్స్ ఫిర్యాదుల పరిష్కారం పై దృష్టి సారించండి

- బల్దియా అదనపు కమిషనర్ జోనా
- వివిధ విభాగాలకు చెందిన 64 ఫిర్యాదుల స్వీకరణ

**వరంగల్, ఆయుధం:** గ్రీవెన్స్ ఫిర్యాదుల పరిష్కారం పై దృష్టి సారించాలని బల్దియా అదనపు కమిషనర్ జోనా అన్నారు. సోమవారం ప్రజావాణి లో అదనపు కమిషనర్ తో పాటు వివిధ విభాగాలకు చెంది ఉన్నతాధికారులు నగర ప్రజల నుండి వివిధ సమస్యల పరిష్కారం కోసం అందజేసిన దరఖాస్తులను పరిష్కారార్థం స్వీకరించారు. టౌన్ ప్లానింగ్ విభాగానికి 26, ఇంజనీరింగ్ విభాగానికి 19, రెవిన్యూ విభాగానికి 7, హెల్త్ & శానిటేషన్ కు 7, నీటి సరఫరా కు 5 చొప్పున మొత్తం 64 వినతులు వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఎఫ్ఓ శంకర్ లింగం, ఇంచార్జి సిపి రవీందర్ రాడేకర్, పన్నుల అధికారి రామకృష్ణ, డిప్యూటీ కమిషనర్ లు ప్రసన్న రాణి, సమ్మయ్య, సెక్రటరీ అనిల్ బాబు, ఈఈ సంజయ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# మంచినీటి సమస్య పరిష్కరించాలి

- గ్రీవెన్స్ లో సిపిఎం కార్యకర్తల బైఠాయింపు
- సీపీఎం వరంగల్ జిల్లా కమిటీ సభ్యులు సింగారపు బాబు

**వరంగల్, ఆయుధం:** ఓరుగంటి సారంగ పాణి నగర్ (ఓ ఎస్ నగర్) లో వారం రోజులుగా మంచినీరు రావట్లేదని ప్రజలు తాగునీటికి ఇబ్బంది పడుతున్నారని సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు, రామన్నపేట ఏరియా కార్యదర్శి సింగారపు బాబు అన్నారు. గ్రీవెన్స్ సెల్ లో వైఎస్ నగర వాసులతో బైఠాయించి తమ నిరసనను తెలిపారు. ఈ సందర్భంగా బాబు మాట్లాడుతూ.. ప్రజల పట్ల, ప్రజా సమస్యల పట్ల మున్సిపల్ అధికారులు ఉదాసీనత విడనాడాలని కోరారు. మంచినీళ్లు సౌకర్యం కల్పించాలని గత అనేక సందర్భాల్లో మున్సిపల్ అధికారులకు విన్నవించుకున్నా, అనేక వినతి పత్రాలు సమర్పించిన సమస్య పరిష్కరించట్లేదని విమర్శించారు. పేద ప్రజలు నివసించే వాడల పట్ల అధికారుల నిర్లక్ష్య వైఖరి తగదని తెలిపారు. తక్షణమే స్పందించి మంచినీటి సరఫరా సక్రమంగా జరిగేటట్లు చూడాలని, లేకుంటే ప్రజల ఆగ్రహానికి గురికావాల్సి వస్తుందని హెచ్చరించారు. అనంతరం వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు వలదాసు దుర్గయ్య, ఓ.ఎస్. నగర్ కార్యకర్తలు వరమ్మ, మల్లికాంబ, మైదం ఆండాళ్ళు, పద్మ, బిట్టు చంద్రకళ, హసీమ పాల్గొన్నారు.






# నేడు దేశవ్యాప్త ధర్నా

- గ్రామీణ తపాల ఉద్యోగులు భారీగా పాల్గొనాలి
- అఖిలభారత గ్రామీణ తపాల ఉద్యోగుల సంఘం జాతీయ అధ్యక్షుడు బొద్దున వెంకటేశ్వర్లు

**హనుమకొండ, ఆయుధం:** గ్రామీణ తపాల ఉద్యోగులపై కొనసాగుతున్న వివక్షా విధానాలను నిరసిస్తూ జూన్ 23న దేశవ్యాప్తంగా అన్ని డివిజనల్ కార్యాలయాల ఎదుట ధర్నా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు అఖిల భారత గ్రామీణ తపాల ఉద్యోగుల సంఘం జాతీయ అధ్యక్షుడు బొద్దున వెంకటేశ్వర్లు తెలిపారు. ఇందులో భాగంగా హనుమకొండ డివిజనల్ పోస్టల్ కార్యాలయం ఎదుట ఉదయం 10 గంటల నుంచి ధర్నా చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. గ్రామీణ తపాల ఉద్యోగులను 8వ కేంద్ర వేతన సంఘం పరిధిలోకి తీసుకురావడం లేదా ప్రత్యేక పే కమిషన్ ఏర్పాటు చేయడం, డిపార్ట్మెంట్ ఉద్యోగులతో సమానంగా పెన్షన్, వైద్య సదుపాయాలు కల్పించడం, ప్రమాద భీమా పరిమితిని రూ.10 లక్షలకు పెంచడం వంటి డిమాండ్ల సాధన కోసం ఈ ఉద్యమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అలాగే జూలై 14న సర్కిల్ కార్యాలయాల ఎదుట భారీ నిరసనలు, ఆగస్టు 1న దేశవ్యాప్త సమ్మె చేపట్టనున్నట్లు వెల్లడించారు. గ్రామీణ తపాల ఉద్యోగులందరూ పెద్ద సంఖ్యలో పాల్గొని ధర్నాను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

# తేనీటి విందుకు ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి





**వరంగల్, ఆయుధం;** ఆర్మూర్ పైడి రాకేష్ రెడ్డి హన్మకొండ జిల్లా ఇంటలెక్చువల్ సమావేశనికి విచ్చేసిన సందర్భంగా డాక్టర్ వన్నాల వెంకట రమణ ఆహ్వానం మేరకు వారి స్వగృహానికి తేనీటి విందుకు హాజరయ్యారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ దూరదృష్టితో కూడిన నాయకత్వంలో ఎన్.డి.ఏ ప్రభుత్వం 12 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా హన్మకొండ లో హంటర్ రోడ్ లో గల వేద ఫంక్షన్ హాల్ ఏర్పాటు చేసిన "Intellectual సమావేశానికి" పాల్గొనేందుకు విచ్చేసిన ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి, డాక్టర్ వన్నాల వెంకటరమణ ఆహ్వానం మేరకు డాక్టర్ వన్నాల స్వగృహానికి తేనీటి విందుకు విచ్చేసిన సందర్భంగా డాక్టర్ వన్నాల వెంకట రమణ, వారి కుటుంబ సభ్యులు పైడి రాకేష్ రెడ్డి ని శాలువాతో సన్మానించి వారిని భద్రకాళి అమ్మవారి చిత్రపటాన్ని బహుకరించారు. వారితో పాటు మాజీ శాసనసభ్యులు టి.రాజేశ్వర్ రావు, మార్తినేని ధర్మ రావు, హన్మకొండ జిల్లా అధ్యక్షుడు సంతోష్ రెడ్డి, మాజీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ, రాష్ట్ర నాయకులు కన్నెబోయిన రాజు యాదవ్, కిసాన్ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మల్లాది తిరుపతి రెడ్డి, వరంగల్ కో ఆపరేటివ్ బ్యాంకు చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్ రావు, మాజీ జిల్లా అధ్యక్షుడు ఎడ్ల అశోక్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సిద్ధం నరేష్, జిల్లా నాయకులు త్రిలోక్, రఘునాథ్ రెడ్డి, బిజెపి నాయకులు పాల్గొన్నారు.




**హన్మకొండ, ఆయుధం:** జనసేనపార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ను విమర్శించే అర్హత తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితకు లేదని జనసేనపార్టీ నాయకులు మండిపడ్డారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ హన్మకొండ పర్యటనలో శనివారం జనసేనాని పట్ల కవిత చేసిన వ్యాఖ్యలు ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. లిక్కర్ స్కామ్ చేసి తీహార్ జైలులో చిప్పకూడు తిన్న కవిత కూడా నీతులు చెప్పడం హాస్యపదంగా ఉందన్నారు. కన్న తండ్రికే వెన్నుపోటు పొడిచి అధికారం కాంక్షతో కవిత మతితప్పి మాట్లాడుతుందన్నారు. సామజిక న్యాయం గురించి కెసిఆర్ పక్కన పదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు ఎందుకు మాట్లాడలేదని వ్యాఖ్యనించారు. రాజకీయ ఉనికి కోసం తెలంగాణ కార్డు పట్టుకొని తిరుగుతున్నందని పేర్కొన్నారు. కవిత ఎన్ని వేషాలు వేసిన తెలంగాణ ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. తెలంగాణ యువత జనసేన వైపు చూస్తున్నారని తెలిపారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ను విమర్శిస్తే మీడియాలో ఉంటానని దిగజారి మాట్లాడుతుందన్నారు. బ్యూటీ పార్లర్ నడిపే కవిత పార్టీ నడిపే డబ్బు ఎక్కడదో చెప్పాలన్నారు. అక్రమంగా తెలంగాణను కవిత కుటుంబం దోచుకొని ఆస్తులు కూడబెట్టారని వ్యాఖ్యానించారు. దమ్ముంటే కవిత ఆస్తుల గురించి తెలంగాణ ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు.

# 26న పద్మశాలి ఉద్యోగుల రాష్ట్ర సదస్సు



**హనుమకొండ, ఆయుధం:** ఈనెల 26న హైదరాబాదులోని ఎల్బీనగర్ స్వకులశాలి సమాజ భవనంలో తెలంగాణ రాష్ట్ర పద్మశాలి ఉద్యోగుల రాష్ట్ర సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలంగాణ పద్మశాలి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఈగ వేంకటేశ్వర్లు తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణ పద్మశాలి ఉద్యోగుల సంఘం రాష్ట్ర సదస్సు వాల్ పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సదస్సు లో తెలంగాణ పద్మశాలి ఉద్యోగుల సంఘం ద్వారా చేపడుతున్న వివిధ కార్యక్రమాల, భవిష్యత్ కార్యాచరణ పద్మశాలి ఉద్యోగుల సమస్యలు మొదలైన అంశం లపై చర్చించడం జరుగుతుందని తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లా పద్మశాలి ఉద్యోగులందరూ పాల్గొని సదస్సు విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రచార కార్యదర్శి దేవులపల్లి సాయిరాజ్, ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షులు కోడం రవి ప్రకాష్, ప్రధాన కార్యదర్శి గుర్రపు రాజమౌళి, అసోసియేట్ ప్రెసిడెంట్ బొద్దుల వెంకటేశ్వర్లు, ఆర్గనైజేషన్ కార్యదర్శి కొండబత్తుల రాజమౌళి, కోశాధికారి బూర తిరుపతయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీలు గోరంటాల అశోక్, చింతకింది శ్రీనివాస్, ప్రచార కార్యదర్శి కోడూరి రమేష్, ఆఫీస్ సెక్రటరీ గుండు రవీందర్, కార్యవర్గ సభ్యులు గడ్డం రాజ్ కుమార్, వద్నాల వెంకటస్వామి, బేతి రాజేందర్, కందగట్ల ప్రసాద్, వల్లల మధుసూదన్, కూచన రాజు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

Edited, Printed, Published and Owned by **V.P.CHANDER.** On Behalf of **VNR MEDIA**. Printed at Pragathi Graphics # 6-8-231, Sagara Veedhi, Hanumakonda.
Published at 2-2-414, Nayeem Nagar, Hanumakonda, TS-506001. RNI: TEL TEL 2019/78717, Email: ayudamdaily@gmail.com. Contact: 98480-15695